
భారత విప్లవ నాయకుడు, కేంద్రకమిటీ సభ్యుడు , పోలిట్ బ్యూరో సభ్యుడు,
పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు
కామ్రేడ్ రామకృష్ణ(అక్కిరాజు హరగోపాల్)కు అరుణారుణ జోహార్లు!
ఆయన అందించిన ప్రేరణతో వేలాదిమంది రామకృష్ణలను తయారు చేద్దాం!
కేంద్రకమిటీ
25 1:16PM
సీపీఐ(మావోయిస్టు)

# సభ్యుడు,
# పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు
# కామ్రేడ్ రామకృష్ణ (అక్కిరాజు హరగోపాల్)కు అరుణారుణ జోహార్లు!
# ఆయన అందించిన ప్రేరణతో వేలాదిమంది రామకృష్ణలను తయారు చేద్దాం!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

మన పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ రామకృష్ణ (అక్కిరాజు హరగోపాల్, శ్రీనివాస్, సాకేత్) 14 అక్టోబర్, 2021న మూత్రపిండాల వైఫల్యంతో అమరుడయ్యాడు. మరొక విప్లవ హృదయం శాశ్వతంగా ఆగిపోయింది. కామ్రేడ్ సాకేత్ అకాల మరణం మన పార్టీకి, కేంద్రకమిటీకి, సెంట్రల్ రీజనల్ బ్యూరో ప్రాంతానికి, ఆంధ్ర, తెలంగాణా ప్రజాస్వామిక ఉద్యమాలకు భారీ నష్టం, భారత విప్లవోద్యమానికి వెంటనే తీర్చుకోలేని లోటు. ఆయన అమరత్వం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు తీవ్ర దుఃఖాన్ని కలిగించింది. పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజాసంఘాలు, నూతన ప్రజాస్వామిక అధికార అంగాలు, యావత్తు విప్లవ ప్రజానీకం తరఫున మన పార్టీ కేంద్రకమిటీ శోకసంతప్త హృదయంతో, ఆయన పట్ల అపార గౌరవంతో తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

కామ్రేడ్ రామకృష్ణ అమరత్వ విషాదవేళలో ఆయన జీవిత సహచరికి, బంధు మిత్రులకు, విప్లవ శ్రేయోభిలాషులకు, ఆయనతో కలసి పనిచేసిన సమకాలికులందరికీ కేంద్రకమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నది. వారందరి సంవేదనలో సంపూర్ణంగా పాలుపంచుకుంటున్నది. అసంపూర్తిగా మిగిలిన ఆయన విప్లవ ఆశయాన్ని పరిపూర్తి చేయటం కోసం అహర్నిశలు కృషి చేస్తామని శపథం చేస్తున్నది.

ఉద్యమంలో ఎన్ని ఆటు-పోట్లు, కష్ట-నష్టాలెదురైనా దృఢసంకల్పంతో, గొప్ప త్యాగనిరతితో, నిస్వార్థంగా, సాదాసీదాగా జీవించడం, ప్రజల ప్రయోజనం కోసం, విప్లవ లక్ష్యం కోసం అవిశ్రాంతంగా పని చేయటం, క్యాడర్లతో ప్రజాస్వామికంగా వ్యవహరించడం, ఎటువంటి కష్ట కాలంలోనైనా క్యాడర్లను, ప్రజలను అంటిపెట్టుకొని వుండటం వంటి అనేక ఉత్తమ కమ్యూనిస్టు ఆదర్శాలను నెలకొల్పాడు కామ్రేడ్ రామకృష్ణ. విప్లవోత్తేజం ఉట్టిపడే వ్యక్తిత్వం కలిగిన ఆదర్శవంతమైన ప్రజాస్వామికవాది, మేరు పర్వతం లాంటి గొప్ప కమ్యూనిస్టు అయిన కామ్రేడ్ రామకృష్ణ ఆదర్శాలను స్వీకరించి ముందుకు తీసుకుపోవటానికి ఆయన విప్లవ ప్రస్థానాన్ని సంక్షిప్తంగా చూద్దాం.

## కామ్రేడ్ రామకృష్ణ కుటుంబ నేపథ్యం

కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్ (రామకృష్ణ, శ్రీనివాస్, సాకేత్)ది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతం. పల్నాడు గడ్డకు పల్నాటి యుద్ధ వీరోచిత పోరాట వారసత్వం ఉంది. అలాగే హరగోపాల్ పూర్వీకులది 1969లో కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ విప్లవకారులతో రహస్య సమావేశం జరిగిన గుత్తికొండ గ్రామం.

అక్కిరాజు కుటుంబాలలో కొంతమంది రాజకీయాల్లోకి ప్రవేశించగా, కొంతమంది సాహితీపరులయ్యారు. సాహితీపరమైన కుటుంబాల నుండి ఎదిగివచ్చిన కామ్రేడ్ రామకృష్ణ తండ్రి సదానందేశ్వర్‌రావుగారు ఆ రోజుల్లో ఏసీ కాలేజిలో డిగ్రీ చదివి హైస్కూల్‌లో ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించాడు. సదానందేశ్వర్‌రావు, రాజ్యలక్ష్మి దంపతులకు గల నలుగురు సంతానంలో రెండవవాడుగా కామ్రేడ్ హరగోపాల్ 1957లో జన్మించాడు. సదానందేశ్వర్‌రావుగారి కుటుంబం ఉద్యోగ రీత్యా పల్నాడులోని తుమ్మకోట గ్రామంలో స్థిరపడింది. కామ్రేడ్ హరగోపాల్‌కు బాల్యంలోనే తండ్రి నుండి ప్రజాస్వామిక, ప్రగతిశీల భావాలు అలవడ్డాయి. ఆయన తుమ్మకోటలో హైస్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత మాచర్ల పట్నంలో ఎస్.కే.బీ.ఆర్. కళాశాలలో డిగ్రీ వరకు చదివాడు.

70వ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్‌లో నక్సల్బరీ విప్లవ రాజకీయాల ప్రభంజనం కొనసాగుతుండింది. ఆనాడు మెజారిటీ విద్యార్థులు ఆదర్శ విప్లవ భావాలతో వుండేవాళ్లు. సమాజంలో కొనసాగుతున్న పేదరికం, దోపిడీ అణచివేత, అసమానతలు, అన్యాయాలు విద్యార్థి యువకులను ఆలోచింపజేసాయి. ప్రజాస్వామిక, ప్రగతిశీల భావాలు కలిగిన విద్యార్థిగా హరగోపాల్ సదా సామాజిక సమస్యల పరిష్కారాల కోసం ఆలోచించేవాడు. ఫలితంగా రాడికల్ విద్యార్థి సంఘ రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యాడు. నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాట వెల్లువ తాత్కాలికంగా వెనకంజ వేసిన తర్వాత ఎత్తుగడలు మార్చుకోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా విప్లవ రాజకీయాల ప్రచారం ఊపందుకుంది. విరసం, రాడికల్ విద్యార్థి సంఘం, జననాట్యమండలి, పౌరహక్కుల సంఘం వంటి విప్లవ, ప్రజాస్వామిక సంఘాలు ఏర్పడ్డాయి.

ఆనాడు మాచర్లను కేంద్రంగా చేసుకొని పార్టీ జిల్లాకమిటీ సభ్యుడుగా పని చేస్తున్న బాలయ్య ప్రభావంతో హరగోపాల్ పూర్తికాలం విప్లవ కార్యకర్తగా ఉద్యమంలో చేరాడు. సామాజిక సమస్యలకు విప్లవమే అంతిమ మార్గమని నమ్మిన హరగోపాల్ తుదిశ్వాస విడిచే వరకు ఆ మార్గంలో కొనసాగుతూ పార్టీలో అత్యున్నత స్థాయికి ఎదిగాడు.

మార్క్సిస్టు సిద్ధాంతంతో సాయుధమైన కామ్రేడ్ హరగోపాల్ తన విప్లవ జీవితం ప్రారంభం నుంచీ సిద్ధాంతాన్ని ఆచరణతో జోడించడంపై శ్రద్ధ పెట్టేవాడు. ఆచరణ నుంచి గ్రహించిన వాస్తవాలను సిద్ధాంతంతో బేరీజు వేసుకునేందుకు కృషి చేసేవాడు. మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదనీ, అది ఆచరణ నుంచి తేలే ప్రశ్న అనే

మార్క్సిస్టు బోధనను ఆయన తన ఆచరణలో అమలు చేసేందుకు తీవ్రంగా కృషి చేసేవాడు. ఇదే ఆయనను చివరి వరకు ప్రజల వైపు నిలబెట్టింది.

**రాడికల్ విద్యార్థి నాయకుడిగా**

1977లో రాడికల్ విద్యార్థులు చేపట్టిన 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో హరగోపాల్ భాగం అయ్యాడు. 1978లో గుంటూరులో జరిగిన రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలకు హాజరై వాలంటీర్‌గా తన సేవలనందించాడు. రాడికల్ విద్యార్థి సంఘం చేపట్టిన అనేక పోరాటాల్లో కామ్రేడ్ హరగోపాల్ కళాశాల విద్యార్థిగా భాగం అయ్యాడు. ఆ కాలంలో మాచర్లలో జరిగిన ఆందోళనలలో ధనలక్ష్మిపై అత్యాచారం, హత్య, ఫిలిప్ లాకప్ హత్య, అంజమ్మపై అత్యాచారం, హత్య వంటి ఘటనలపై, సిమెంట్ ఫ్యాక్టరీ కాలుష్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం మొదలయినవి ఉన్నాయి. ఈ పోరాటాలన్నీ రాడికల్స్ నాయకత్వంలో రాజ్య వ్యతిరేక ఆందోళనలుగా విస్తృత ప్రజల మద్దతును కూడగట్టాయి. ఇలా ఆయన తన విద్యార్థి జీవితం నుండే ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించసాగాడు.

1980లలో కామ్రేడ్ అక్కిరాజు కుటుంబం హైదరాబాద్‌కు తరలిపోయింది. ఆ సమయంలో కిడ్నీ సమస్యకు ఆపరేషన్ జరగటంతో ఒక సంవత్సర కాలం పాటు ఆయన విశ్రాంతి తీసుకొన్నాడు. ఆ తరువాత 1981 నుండి ఆయన పూర్తి కాలం విప్లవకారుడుగా బాధ్యతలు స్వీకరించి ఉద్యమంలో భాగమయ్యాడు. గుంటూరు జిల్లా కమిటీ నిర్వహించిన రాజకీయ తరగతులలో భాగమయ్యాడు.

**కేంద్ర ఆర్గనైజర్‌గా గుంటూరు జిల్లా ఉద్యమంలో ప్రాథమిక పాఠాలు**

గుంటూరు జిల్లాలో నక్సల్బరీ తరం నాటి అమరులు కామ్రేడ్స్ బిక్కిరాములు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు, అమరుడు కామ్రేడ్ సూర్యం గారు తదితర అమరులు చూపిన మార్గంలో జిల్లా ఉద్యమాన్ని అభివృద్ధి చేసిన పార్టీ నాయకత్వ కామ్రేడ్స్‌లో కామ్రేడ్ హరగోపాల్ ఒకరు. ఆయన పల్నాడు భూమిపుత్రుడు కావడం ఇందుకు ఎంతగానో తోడ్పడింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విప్లవోద్యమంలో భాగంగా గుంటూరు జిల్లాలో ఉద్యమం క్రమంగా పునస్సంఘటితమైంది. మొదట గుంటూరు పట్టణంలో కార్మికులలో, విద్యార్థి-యువతలో, మేధావులలో సంఘటితమైన ఉద్యమాన్ని క్రమంగా నల్లమల అడవులకు విస్తరింపజేసే లక్ష్యంతో పార్టీ పని చేసింది. 1980ల ప్రారంభంలో జిల్లాలో వెనుకబడిన, ప్రధానంగా నల్లమల్ల అడవులకు ఆనుకుని వున్న మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి తాలూకాలలోని గ్రామీణ ప్రాంతాలకు పలువురు కార్యకర్తలను ఆర్గనైజర్లుగా పంపింది. వారు టీచర్లుగా, డాక్టర్లుగా గ్రామాలలోకి వెళ్లి పనిచేసారు. అందులో కామ్రేడ్ హరగోపాల్ ఒకడు. పల్నాడు ప్రాంత ప్రజలకు కామ్రేడ్ సాకేత్ గామాలపాడు గోపాల్ పంతులుగా పరిచయం. గ్రామంలోని దళితవాడ (క్రిస్టియన్ పాలెం) ఆయన నివాసం. ఈ క్రమంలోనే విప్లవ పాఠాలు చెప్పడం ఆరంభించాడు.

కామ్రేడ్ హరగోపాల్ గ్రామాలలో దళితుల బతుకులు చూసి బాగా చలించిపోయేవాడు.

ఆయన విప్లవ జీవితంలో తొలి నుంచి చివరిదాకా దళిత సమస్యకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చాడు. దాచేపల్లి ఏరియాలో దళిత సమస్యపై స్థానికంగా గ్రామాలలో దళితులతో చర్చించేందుకు, వారిలో పోరాట ఆకాంక్షను రేకెత్తించేందుకు, తామూ మనుషుల్లాగా బతకాలంటే పోరాడక తప్పదనే చైతన్యాన్ని వారిలో కలిగించేందుకు, వారిని సంఘటితం చేసేందుకు కృషి చేసాడు. ఆ చుట్టుపట్ల గ్రామాలు, పిడుగురాళ్ల ప్రాంతంలో ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకుని రహస్యంగా రాడికల్ యువజన సంఘాలను (ఆర్వైఎల్) స్థాపించాడు. భూమి సమస్య, కూలిరేట్ల పెంపుదల తదితర సమస్యలపై పలు పోరాటాలు నిర్వహించాడు.

గామాలపాడు గ్రామానికి పక్కనే దుర్గా సిమెంట్ ఫ్యాక్టరీలో చుట్టుపక్కల గ్రామాల నుంచి కాంట్రాక్టు కూలీలుగా పనిచేస్తున్న ప్రజలను కామ్రేడ్ హరగోపాల్ సంఘటితం చేసి పలు మిలిటెంట్ పోరాటాలు నడిపాడు. మరోవైపు శ్రీరాంపురం తండా ప్రాంతంలో పార్టీ నాయకత్వంలో మిలిటెంట్ నాపరాయి కార్మికుల పోరాటాలు ముందుకువచ్చాయి. బలమైన నాపరాయి కార్మిక సమాఖ్య ఏర్పడింది. ఈ పోరాటాలు పలు కార్మిక పోరాటాలకు ప్రేరణగా నిలిచాయి. 1985లో కారంచేడులో దళితుల హత్యకాండకు నిరసనగా ప్రజలను, ప్రత్యేకించి దళితులను సమీకరించి ప్రదర్శనలు నిర్వహించాడు. అప్పటికే మాచర్ల పట్టణంలో బలమైన రాడికల్ విద్యార్థి సంఘం ఉండేది. ఇవన్నీ ముఖ్యంగా ఎగువ పల్నాడు ప్రాంతంలో విప్లవోద్యమ అభివృద్ధికి పునాదులు వేసాయి. ఈ పోరాటాలతో ఆనాటికి కామ్రేడ్ హరగోపాల్‌కు ప్రత్యక్ష సంబంధం లేకపోయినప్పటికీ మాచర్ల పట్టణంలో, గామాలపాడు ప్రాంతంలో ఆయన చేసిన కృషి మిగతా ప్రాంతాలకు ప్రేరణగా ఉంటూ వచ్చింది.

దాచేపల్లి ప్రాంతంలో పోరాటాలలో సంఘటితమైన ప్రజలలో క్రియాశీలమైన శక్తులతో పార్టీ సెల్స్ నిర్మించాడు. ఒక వైపు ప్రజా పోరాటాలు, మరో వైపు పార్టీ నిర్మాణాలలో శిక్షితులవుతున్న యువకుల నుండి విప్లవ రాజకీయాలలోకి పూర్తికాలం విప్లవకారులుగా రావడం మొదలైంది. పార్టీ నిర్మాణం అభివృద్ధి చెందుతున్న ఈ క్రమంలో కామ్రేడ్ హరగోపాల్ 1985లో జరిగిన పార్టీ గుంటూరు జిల్లా 2వ మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యాడు. అందులో జిల్లా ఉద్యమాన్ని సమీక్షించుకుని ఉన్నత కర్తవ్యాలను రూపొందించుకోవడంలో ఆయన క్రియాశీల పాత్ర పోషించాడు.

ఈ మహాసభ తర్వాత గుంటూరులో బాంబు పేలుడు సంఘటనను సాకుగా తీసుకుని జిల్లా వ్యాప్తంగా మన ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు శత్రువు పలు దాడులు నిర్వహించాడు. అనేక మంది సీఓలను, ప్రజాసంఘాల కార్యకర్తలను, సానుభూతిపరులను అరెస్టు చేసి క్రూరమైన 'టాడా' చట్టాన్ని మోపి ఒక భయానక వాతావరణాన్ని సృష్టించాడు. ఈ నిర్బంధానికి వెరిచి కొందరు సీఓలు, పీఆర్‌లు దిగజారిపోయారు. హరగోపాల్‌కు గురుతుల్యుడైన బాలయ్య రాజకీయ బలహీనతతో విప్లవోద్యమం నుండి వెనక్కి వెళ్లాడు. అలాంటి పరిస్థితిలో కామ్రేడ్ హరగోపాల్ ఆయనను ఒక నెగిటివ్ టీచర్‌గా తీసుకొని రాజకీయ దృఢత్వాన్ని పెంచుకున్నాడు. కేడర్లను నిలబెట్టడం కోసం ఓపికగా కృషి చేసాడు.

## జిల్లా కమిటీ సభ్యునిగా

1986 డిసెంబర్‌లో జరిగిన గుంటూరు జిల్లా పార్టీ ప్లీనం కామ్రేడ్స్ హరగోపాల్, మస్తాన్‌రావు (అమరుడు)లను జిల్లా కమిటీలోకి ఎన్నుకుంది. జిల్లా కమిటీ సభ్యునిగా హరగోపాల్ దాచేపల్లి, బెల్లంకొండ సెంటర్లను గైడ్ చేస్తూ, ప్రత్యేకంగా మాచర్ల, నాగార్జున సాగర్ పట్టణాలలో విద్యార్థి ఉద్యమ బాధ్యతలను కూడ చూశాడు. 1986-87 సంవత్సరాలలో నల్లమల అటవీ ప్రాంతానికి ఉద్యమాన్ని విస్తరింపజేసే లక్ష్యంతో సర్వే దళాన్ని పంపడం, సర్వే రిపోర్టుపై ఆధారపడి ఉద్యమ నిర్మాణానికి పథకం రూపొందించడంలో ఆయన కీలకపాత్ర పోషించాడు.

1988-89 ప్రాంతంలో జిల్లా ఉద్యమంలో కొన్ని ముఖ్యమైన పోరాటాలు ముందుకు వచ్చాయి. పార్టీ పల్నాడు ప్రాంతంలో ప్రజలపై కొనసాగుతున్న ఫారెస్టు డిపార్ట్‌మెంటు దౌర్జన్యాలు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను పోరాటానికి సిద్ధం చేసింది. ఈ ప్రజా పోరాటం పల్నాడు ప్రాంతమంతటా విస్తరించింది. ఆ తరువాత క్రమంగా జిల్లాలో తునికాకు కూలీ రేట్ల పెంపుదల పోరాటం, సారా వ్యతిరేక పోరాటం, మత్స్య కార్మికుల సమస్యలపై పోరాటం, ఫారెస్టు భూముల, బంజరు భూముల ఆక్రమణ పోరాటం, నాపరాయి క్వారీల ఆక్రమణ పోరాటం, సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై పోరాటం మున్నగు అనేక పోరాటాలు ముందుకు వచ్చాయి. కృష్ణా నది తీర ప్రాంత గ్రామాలలో రేవు పడవలపై పెత్తందార్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టి పడవలను గ్రామ కమిటీలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ప్రజా పోరాటాలన్నీ జిల్లాలోని విశాల గ్రామీణ ప్రాంతంలో పార్టీ సంఘటితం కావడానికి దోహదం చేశాయి.

1989 నాటికి జిల్లాలో ఆరు కేంద్రాలు ఏర్పడ్డాయి. సుమారు 300 గ్రామాలకు పార్టీ కార్యకలాపాలు విస్తరించాయి. ఇందులో కామ్రేడ్ హరగోపాల్ కృషి ఒక ముఖ్య భూమికను పోషించింది. ఆ పోరాటాలలో నుండి ఎంతో మంది యువకులు విప్లవ రాజకీయాలతో ఉత్తేజితులై విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తలుగా చేరారు. 1988 అక్టోబర్‌లో కామ్రేడ్ సూర్యం (అమరుడు) అరెస్టు కావడంతో కామ్రేడ్ హరగోపాల్ 1989 ఫిబ్రవరిలో జిల్లా కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు. అప్పటినుండి 'శ్రీనివాస్' పేరుతో జిల్లా కమిటీ కార్యదర్శిగాను, దక్షిణ కోస్తా రీజనల్ కమిటీ సభ్యుడుగాను పని చేసాడు. జిల్లా కార్యదర్శిగా గుంటూరు, తెనాలి, చుండూరు ప్రాంతాల ఉద్యమాలకు నాయకత్వాన్ని అందించాడు. కా.సూర్యంగారి అమరత్వంతో జిల్లా కార్యదర్శి బాధ్యతలలోకి, ఆర్‌సీలోకి వచ్చి, ఆ తరువాత ఆర్‌సీ కార్యదర్శిగా కూడా ఉన్న రాంబాబు దిగజారిపోవడంతో ఆ స్థానంలో కా.సాకేత్ ఆర్‌సీ కార్యదర్శి బాధ్యతలలోకి వచ్చాడు. 1993 ఫిబ్రవరిలో జిల్లా కమిటీ కార్యదర్శి బాధ్యతల నుండి రిలీవ్ అయ్యి దక్షిణ కోస్తా జిల్లాల రీజినల్ కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు. ఆ తర్వాత జరిగిన రాష్ట్ర ప్లీనంలో ప్రత్యామ్నాయ రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

కామ్రేడ్ అక్కిరాజు అంచెలంచెలుగా ఎదిగిన ఈ కాలంలో - 1990లో కోస్తా జిల్లాల్లో బీభత్సాన్ని సృష్టించిన పెనుతుఫాను బాధితులకు చందాలు సేకరించి అందచేయడంలో జిల్లా కార్యదర్శిగా హరగోపాల్ చేసిన కృషి మరువలేనిది. చీరాలలో మన పార్టీ నాయకత్వంలో

1990 జులై 17న కారంచేడు మృతవీరుల స్మారక స్థూప ఆవిష్కరణ సభ, 1991 ఆగస్టు 6న చుండూరులో 25 మంది దళితుల నరమేధం మొదలయిన ఘటనల సందర్భంగా ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించి కుల సమస్య పట్ల పార్టీ వైఖరిని ప్రజల ముందుంచాడు. బాధితులను స్వయంగా కలుసుకొని వారి ఆవేదనలో, సంవేదనలో హరగోపాల్ పాలుపంచుకున్నాడు. ఆ తదుపరి చుండూరు ఏరియాలో గెరిల్లా దళాన్ని ఏర్పాటు చేసి ప్రత్యక్ష గైడెన్స్‌ను అందించాడు.

జిల్లాలో పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయడంలో భాగంగా జిల్లాలో ఎస్‌పీ మీనా ఆధ్వర్యంలో పోలీసు బలగాలు దాచేపల్లి దళసభ్యుడు కామ్రేడ్ కోటేశ్వరరావును, జూలకల్లు సంఘ సభ్యుడు కామ్రేడ్ జయపాల్‌లను హత్య చేసాయి. 1992 ఏప్రిల్ 1న చంద్రవంక ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ ఏసన్న (రాజన్న), రామకృష్ణ, మాధవీలతలను క్రూరంగా హత్య చేసాయి. ఈ హత్యలకు నిరసనగా ప్రజా ప్రతిఘటనను పెంపొందించేందుకు కామ్రేడ్ హరగోపాల్ కృషి చేసాడు. ప్రజలు పెద్దెత్తున కదిలి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసారు. చంద్రవంక ఎన్‌కౌంటర్ తర్వాత జిల్లావ్యాప్తంగా శత్రు దాడులు, అరెస్టులు, చిత్రహింసలు మరింత తీవ్రతరం కావడంతో ఒక భయానక వాతావరణం ఏర్పడింది. కొంతమంది కార్యకర్తలు దిగజారి శత్రువుకు సరెండర్ అయ్యారు. ఈ నిర్బంధ వాతావరణంలో జిల్లా కార్యదర్శిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అమరుడు కామ్రేడ్ మస్తాన్‌రావుతో కలిసి ఆర్‌సీఎంగా కామ్రేడ్ హరగోపాల్ ప్రజాసంఘాలలో, ప్రజలలో కదలిక తీసుకొచ్చేందుకు ఓపికగా కృషి చేసాడు. ప్రజాసంఘాలను రహస్యంగా పని చేయిస్తూ వివిధ సమస్యలపై ప్రజలను కదిలించి ప్రజా పోరాటాలను నిర్మించాడు. నిరంతరం కరువుతో తల్లడిల్లే పల్నాడు ప్రజలను కరువు వ్యతిరేక పోరాటాలలో సంఘటితం చేసాడు. 1990-91లలో జరిగిన ఎగువ పల్నాడుకు సాగునీటి డిమాండులో భాగంగా దొమ్మర్లగొంది ఎత్తిపోతల పథకం కోసం జరిగిన ఐక్యసంఘటన పోరాటానికి తగు విధంగా మార్గదర్శకత్వాన్ని అందించాడు.

దళితవాడ (క్రిస్టియన్‌పాలెం)పై దాడికి భూస్వాములు వేసుకున్న పథకాన్ని తిప్పికొట్టడంలో భాగంగా 1993లో గ్రామ భూస్వామి అచ్చిరెడ్డిని, అంకిరెడ్డిలను నిర్మూలించడం ద్వారా దళిత సమస్యకు సాయుధ పోరాట కోణాన్ని జోడించడంలో కామ్రేడ్ హరగోపాల్ కామ్రేడ్ మస్తాన్‌రావుతో కలిసి తన వంతు కృషి చేసాడు. ఫలితంగా 'మీరు కారంచేడులు సృష్టిస్తే మేము రామాపురాలు సృష్టిస్తాం' నినాదం ముందుకు వచ్చింది. కామ్రేడ్ సాకేత్ మాటల్లో చెప్పాలంటే 'పోచగాడు పోచయ్య అయ్యాడు'.

1992లో గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల దళ కమాండర్లకు, సీఓలకు పార్టీ నిర్వహించిన దక్షిణ కోస్తా రీజనల్ మిలటరీ క్యాంపులో హరగోపాల్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. జిల్లాలోని దళాలను మిలటరీపరంగా, నిర్మాణపరంగా సంఘటితం చేయడంలో విశేషంగా కృషి చేసాడు. మిలటరీ సెన్స్‌ను పెంచడం, ఆయుధాలను సమకూర్చుకోవడం, గెరిల్లా పద్ధతులను అమలు జరపడం వంటి పద్ధతులను దళాల్లో అమలు జరిపేందుకు, దళం పని పద్ధతుల్లో మెరుగుదల తెచ్చేందుకు చాలా కృషి చేశాడు. దళాలలో పీఆర్ సెల్స్ నిర్మాణాన్ని చేపట్టి

రాజకీయంగాను, మిలటరీ పరంగాను, వాటిని సంఘటితం చేసేందుకు కృషి చేశాడు. జిల్లాలో గ్రామీణ ప్రాంత ఉద్యమం ఒకవైపు నడుస్తుండగా గుంటూరు, విజయవాడ, తెనాలి వంటి పట్టణాలలో విద్యార్థి, యువజన, మేధావి, మహిళా, కార్మికులలో విప్లవ కృషికి ఆయన దోహదం చేశాడు. పట్టణోద్యమాన్ని, గ్రామీణోద్యమాన్ని సమన్వయంతో నడిపించడంలో కామ్రేడ్ హరగోపాల్ కృషి చేశాడు.

అమెరికా సామ్రాజ్యవాదుల ఎల్ఐసీ విధానం అమలులో భాగంగా దేశ, రాష్ట్ర పాలక వర్గాలు కోవర్టు, ఇన్ఫార్మర్ వ్యవస్థను బలోపేతం చేశాయి. పార్టీలో పనిచేస్తున్న సాయి అనే కార్యకర్తను ఇమ్మానుయేల్ రాజు అనే ఇంటలిజెన్స్ సీఐ 1991లో కోవర్టుగా మారిస్తే కామ్రేడ్ హరగోపాల్ నాయకత్వంలో అక్కడి పార్టీ కమిటీ ఎంతో చాకచక్యంగా పథకం రూపొందించింది. కోవర్టు సాయి ద్వారానే ఇమ్మానుయేల్ రాజు ఆనుపానులను తెలుసుకుంది. విజయవాడ హోటల్‌లోనే మన పార్టీ యాక్షన్ టీం వాడిని ఖతం చేసింది. ఆ తరువాత మరి కొన్ని కోవర్టు ప్రయత్నాలను వమ్ము చేసేందుకు ఈ ఘటన ఉపయోగపడింది.

1993–94లో పల్నాడులోని అన్ని ప్రాంతాలలో దేవుడు మాన్యం భూముల ఆక్రమణ పోరాటాల వెల్లువ అభివృద్ధి చెందింది. ఇది జిల్లాలో భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని ప్రభుత్వ వ్యతిరేక సాయుధ వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధంగా జిల్లాను గెరిల్లా జోన్‌గా అభివృద్ధి చేసేందుకు తోడ్పడింది.

**రాష్ట్ర కమిటీ సభ్యునిగా**

కామ్రేడ్ హరగోపాల్ 1995లో రాష్ట్రకమిటీ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించాడు. 1994లో ఆనాటి రాష్ట్రకమిటీ సభ్యుడిగా వున్న కామ్రేడ్ సూర్యం గారిని పోలీసులు పట్టుకొని హత్యచేశారు. ఈ ఘటన కామ్రేడ్ హరగోపాల్ సహ రీజియన్‌లోని పార్టీ కార్యకర్తలందరినీ తీవ్రమయిన దు:ఖంలో ముంచింది. త్యాగాలు అనివార్యమనీ అమరుడు సూర్యం గారు బోధించిన విషయాలను మదిలో నిలుపుకొని జరిగిన నష్టాలను పూడ్చేందుకు మరింత పట్టుదలతో రాష్ట్రకమిటీ సభ్యునిగా హరగోపాల్ తన బాధ్యతలను నిర్వహించాడు. ఆయన విప్లవ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ప్రజాయుద్ధంలో నాయకత్వ స్థాయిలో ముందుకు నడిచాడు.

**దక్షిణ తెలంగాణ బాధ్యుడిగా**

పార్టీ మీద శత్రువు నిర్విరామంగా కొనసాగిస్తున్న నిర్బంధకాండలో ఎంతోమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. దక్షిణ తెలంగాణకు బాధ్యుడిగా వున్న కామ్రేడ్ సంజీవ్ (మేకల దామోదర్ రెడ్డి) 1997 మార్చిలో అమరుడయ్యాడు. ఆ తదుపరి దక్షిణ తెలంగాణ బాధ్యతలను పార్టీ కామ్రేడ్ హరగోపాల్‌కు అప్పగించింది. నిప్పులు చెరిగే నిర్బంధంలో ఎంతో మంది కామ్రేడ్స్ అమరులవుతున్నా, దక్షిణ తెలంగాణ తనకు కొత్త ప్రాంతమయినప్పటికీ ప్రజల మీద పూర్తి విశ్వాసంతో, ఎటువంటి శషభిషలు లేకుండా కామ్రేడ్ హరగోపాల్ పార్టీ ఇచ్చిన బాధ్యతలను విప్లవ స్ఫూర్తితో స్వీకరించి కొద్ది కాలంలోనే అక్కడి క్యాడర్ల అభిమానాన్ని పొందాడు. ఉద్యమ

క్రమంలో ఎదురయ్యే అనేక సవాళ్లను స్వీకరించి పరిష్కరించాడు. దక్షిణ తెలంగాణ ఉద్యమాన్నీ అక్కడి నిర్దిష్ట పరిస్థితులనూ ఒక విద్యార్థిలాగా అధ్యయనం చేసి అర్థం చేసుకున్నాడు. ప్రజలే గురువులని నమ్మిన హరగోపాల్ ప్రజల నుండి, క్యాడర్ల నుండి, కమిటీల నుండి, కింది స్థాయి నిర్మాణాల నుండి నిత్యం నేర్చుకుంటూ దక్షిణ తెలంగాణ ఉద్యమాన్ని పార్టీ నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అభివృద్ధి చేయటంలో విశేషంగా కృషి చేశాడు. ఆ నిర్బంధ సమయంలో దళాలలో పనిచేసిన కామ్రేడ్స్, కామ్రేడ్ హరగోపాల్ గురించి చెబుతూ, ఆయన క్యాడర్లకు నిరంతరం స్ఫూర్తినిస్తూ, ధైర్యానిస్తూ, మంచి ప్రజాస్వామిక కామ్రేడ్లీ వాతావరణం మధ్య తమను నడిపించేవాడని, క్యాడర్ల నుండి విడిపోయి వేరుగా ఎన్నడూ వుండలేదని గుర్తు చేసుకుంటారు.

దక్షిణ తెలంగాణలో 1997 నుండి 2000 వరకు ఆ రీజనల్ కమిటీ కార్యదర్శిగా కూడా కొనసాగాడు. 1995 పార్టీ కాన్ఫరెన్స్‌లో నిర్దేశించుకున్న గెరిల్లాజోన్ కర్తవ్యాన్ని పరిపూర్తి చేసేందుకు అలుపెరుగని కృషి చేశాడు. ప్రజా మిలీషియా (జీఆర్‌డీ)ను నిర్మిస్తూ నూతనంగా ప్రారంభమైన గ్రామరాజ్య కమిటీ నిర్మాణాలను విస్తృతపరిచేందుకు పట్టుదలగా కృషి చేశాడు. విప్లవోద్యమమే నిజమైన ప్రత్యామ్నాయం అనే భావనను పెంపొందించాడు. దోపిడీ వర్గాల అధికారాన్ని కూలదోసేందుకు వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ గెరిల్లా జోన్‌లో గెరిల్లా బేసుల నిర్మాణానికి సడలని దీక్షతో పని చేశాడు.

1996-97లలో వచ్చిన మరో విడత నిర్బంధ తాకిడికి ఉద్యమం కొన్ని తీవ్ర నష్టాలనే ఎదుర్కొంది. విప్లవ ప్రజాసంఘాలపై నిషేధం కారణంగా బహిరంగ కార్యక్రమాలు దాదాపు నిలిచిపోయాయి. దానితో, వివిధ కవర్లలో బహిరంగ సంఘాలతో పాటు రహస్య సంఘాలను నిర్మించి పనిచేయిస్తూ, వాటిలో రహస్య ఆర్‌ఎస్‌యు యూనిట్ల ద్వారా విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని గైడ్ చేశాడు. రహస్య పని విధానంపై విద్యార్థి ఆర్గనైజర్లలో అవగాహన పెంపొందించడానికి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ వర్క్‌షాప్‌లు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో కూడా విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు రహస్య పని విధానంపై జిల్లా కమిటీలకు అవగాహన కల్పించడంలో హరగోపాల్ చాలా కృషి చేశాడు.

1996 నుండి పట్టణోద్యమంపై తీవ్రమైన శత్రుదాడిలో విప్లవశక్తులు నష్టపోకుండా కాపాడుకునేందుకు, వారిని తాత్కాలికంగా గ్రామీణ ప్రాంతాలకు రిట్రీట్ చేసే ఎత్తుగడలను పార్టీ చేపట్టింది. రహస్య సంఘాలను, కార్యకలాపాలను బహిరంగ సంఘాల కార్యకలాపాలతో సమన్వయించి మెలకువతో నడిపించటంలో కామ్రేడ్ హరగోపాల్ మంచి అనుభవాన్ని, నైపుణ్యాన్ని గడించాడు.

భూస్వామ్య దళారీ పాలకవర్గాల్లో భాగమైన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌ను గద్దెదింపి తాను ముఖ్యమంత్రి అయిన నాటి నుండి రాష్ట్రం వరల్డ్ బ్యాంక్ పథకాల అమలుకు ఒక పెద్ద ప్రయోగశాలగా మారింది. ఎల్ఐసీ పథకాల అమలు తీవ్రతరమైంది. గెరిల్లా దళాలలో కోవర్టుల సమస్య తలెత్తి ఒక అవిశ్వాస వాతావరణం ప్రబలి ఉద్యమానికి తీవ్ర నష్టం వాటిల్లింది. మరోవైపు పోలీసుల కనుసన్నలలో నల్లదండు ముఠాలు రంగం మీదికి వచ్చి స్వైర విహారం

చేశాయి. ఇందులో భాగంగా దక్షిణ తెలంగాణలో నయీముద్దిన్ ముఠా విప్లవ ప్రజాసంఘాల నాయకులను హతమారుస్తూ, గ్రామాల్లో బలహీనమైన సంఘ నాయకులను భయకంపితులను చేసి లొంగదీసుకుంటూ, తీవ్ర భయానక వాతావరణాన్ని సృష్టించింది. ఆ పరిస్థితుల్లో కామ్రేడ్ హరగోపాల్ దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని దళాలతో వుంటూ పరిస్థితులను వెంట వెంటనే చర్చిస్తూ, సమీక్షిస్తూ కేడర్లలో తిరిగి ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని నింపేందుకు ప్రతిభావంతమైన కృషి సలిపాడు. ఫలితంగా దళాలలోకి చొరబడిన కోవర్టులను పసిగట్టి ఏరివేసే కృషి కొనసాగింది. ఎల్ఐసీలో భాగంగా ఎదురైన ఈ నూతన అనుభవాలను మొత్తం పార్టీకి అందించి అప్రమత్తం చేయడంలో కామ్రేడ్ హరగోపాల్ పాత్ర సదా అనుసరణీయం.

ఉద్యమంలో పొడసూపిన కార్మికవర్గేతర ధోరణులు, తప్పుడు పద్ధతుల మీద 1999 జనవరిలో జరిగిన రాష్ట్ర ప్లీనంలో చర్చించి యావత్తు పార్టీని సరిదిద్దుకునేందుకు రాష్ట్రకమిటీ ఒక సమగ్రమైన 'ఎడ్యుకేషన్, రెక్టిఫికేషన్' కార్యక్రమాన్ని రూపొందించింది. పార్టీలో తలెత్తిన అన్యవర్గ ధోరణుల మూలాలను అర్థం చేసుకునేందుకు సిద్ధాంత అధ్యయనం కొనసాగింది. మొదట పార్టీ కమిటీలలో, తరువాత గెరిల్లా దళాలలో తమ ఆచరణను సమీక్షించుకొని తప్పులను గుర్తించి విమర్శ–ఆత్మవిమర్శల ద్వారా నూతన ఆచరణకు పూనుకున్నారు. ఆ వెలుగులోనే వర్గపోరాటం జరిగిన ఐదు బలమైన ప్రజా పునాది గల గ్రామాలను ఎంచుకొని తమ ఆచరణలోని తప్పులను ప్రజల సమక్షంలో సరిదిద్దుకునే కార్యక్రమాన్ని అన్ని ఏరియాలలో నిర్వహించారు. ఈ మొత్తం కార్యక్రమంలో కామ్రేడ్ హరగోపాల్ చురుకైన పాత్రను పోషించాడు.

1999 డిసెంబర్ 2న మన పార్టీ ప్రియతమ నాయకులు, కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యామ్, మహేశ్, మురళీలను చంద్రబాబు ప్రభుత్వ పోలీసులు కోవర్టు కుట్రతో హత్యచేశారు. ఈ తీవ్ర దుఖం నుండి వెంటనే తేరుకొని దేశ విప్లవోద్యమంలో ప్రముఖంగా నిల్చిన ఆంధ్రరాష్ట్ర విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి కామ్రేడ్ హరగోపాల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బాధ్యతలను స్వీకరించాడు.

దళిత వ్యతిరేకి, క్రూరమైన భూస్వామి బుడ్డ వెంగల్‌రెడ్డిని ప్రజల అండదండలతో కర్నూల్ జిల్లా డీఎస్‌పీ బంగ్లాలోనే మన యాక్షన్ టీం ఖతం చేసింది. తెలుగుదేశం ప్రభుత్వంలో హోంశాఖతో పాటు పంచాయతిరాజ్ శాఖ మంత్రిగా వున్న ఎలిమినేటి మాధవరెడ్డిని హైదరాబాద్ శివార్లలోనే మన స్పెషల్ యాక్షన్ టీం నిర్మూలించింది. అలాగే, హైదరాబాద్ నడిబొడ్డున సంజీవరెడ్డి నగర్ చౌరస్తాలో క్రూరమైన పోలీసు అధికారి ఉమేష్‌చంద్రను అదే స్పెషల్ యాక్షన్ టీం ఖతం చేసింది. దీంతో పట్టణాలు కంచుకోటలని విర్రవీగే ప్రభుత్వానికి ఒక పెద్ద షాకిచ్చినట్లైంది.

## కేంద్ర కమిటీ, పోలిట్ బ్యూరో సభ్యునిగా కామ్రేడ్ హరగోపాల్ విశిష్ట భూమిక

2001లో జరిగిన మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ 9వ కాంగ్రెస్‌లో కామ్రేడ్ హరగోపాల్ కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికయ్యాడు. ఈ కాంగ్రెస్ కేంద్ర కర్తవ్యాన్ని అమలు చేయడంలో

లోపాలను చర్చించి ఆశించిన ఫలితాలను సాధించలేకపోయామని సమీక్షించింది. రానున్న కాలానికి నిర్మాణ, సైనిక, రాజకీయ కర్తవ్యాలను రూపొందించింది. నూతన బాధ్యతలలోకి వచ్చిన కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్ తాను పని చేస్తున్న రాష్ట్రంలో ఈ కర్తవ్యాల అమలుకు పూనుకున్నాడు.

తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి పదవిని చేపట్టాక రాష్ట్రంలో ఫాసిస్టు పాలన మరింత తీవ్రతరమైంది. చంద్రబాబు ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి రాష్ట్రాన్ని వల్లకాడుగా మార్చబూనుకున్నాడు. ప్రజలపై, విప్లవోద్యమంపై ఫాసిస్టు అణచివేత విధానాలతో విరుచుకుపడుతున్న చంద్రబాబును మట్టుబెట్టడానికి తిరుపతి సమీపంలోని అలిపిరి వద్ద పీఎల్‌జీఏ స్పెషల్ యాక్షన్ టీం 2003లో చంద్రబాబుపై దాడి చేసింది. ఈ దాడితో పాలకవర్గాల్లో  కలవరం పెరిగింది. విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి చేపట్టిన రహస్య పని విధానం, రహస్య నిర్మాణాలను, బహిరంగ నిర్మాణాలను, మిలిటరీ చర్యలను, ప్రజా పోరాటాలను సమన్వయంతో నడపడంలో కామ్రేడ్ హరగోపాల్ అద్వితీయమైన పాత్ర పోషించాడు. ఎస్ఎమ్‌సీ కింద రెండు సబ్ రీజినల్ కమాండ్లు ఏర్పడ్డాయి. కామ్రేడ్ ఆర్.కే. రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా వుండి ఈ మొత్తం నిర్మాణాలను, కార్యక్రమాలను పర్యవేక్షించాడు.

రాష్ట్రంలో పెరుగుతున్న ఫాసిస్టు అణచివేత దాడులను ఎండగడుతూ అత్యున్నత స్థాయి మేధావి వర్గాన్ని విప్లవ రాజకీయాల వైపు ఆకర్షించి ప్రభుత్వాన్ని చట్ట వ్యతిరేక చర్యలపై నిలదీసేలా చేయడంలో సఫలీకృతమైనాడు. ఈ కృషితో రాష్ట్రంలో మేధావి వర్గంలో కామ్రేడ్ హరగోపాల్‌కి ఒక గౌరవప్రద స్థానం ఏర్పడింది. దానితో 2004లో రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు, వాటి వైఫల్యంలో ప్రభుత్వం అనుసరించిన మోసపూరిత చర్చల విద్రోహకర విధానాన్ని వెల్లడి చేయడంలో విప్లవ పార్టీ నిజాయితీని ఎత్తిపట్టడంలో అది ఎంతగానో తోడ్పడింది. అంతేకాదు, ఆ తరువాత రాష్ట్రంలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా అందులో రామకృష్ణ ఉన్నాడనీ, గాయపడినాడనీ, మరణించాడనీ వార్తలు వెలువడిన ప్రతి సందర్భంలో వారు తీవ్ర ఆందోళనకు గురై ఆయన క్షేమాన్ని కాంక్షించారు. ఆయనను కాపాడుకోవడానికి ఐక్యంగా తమ నిరసన గళాన్ని ప్రభుత్వానికి వినిపించారు. ఈ కృషి ఉద్యమ సమర్థకులే కాకుండా సాధారణ ప్రజలు కూడా ఉద్యమంపై అణచివేతను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడింది.

2002 నుండి రాష్ట్రంలో పాలకవర్గ పార్టీల మధ్య వున్న వైరుధ్యాన్ని వుపయోగించుకునేందుకు వీలుగా కొన్ని ఎత్తుగడలను రూపొందించి అమలు జరపడంలో కామ్రేడ్ హరగోపాల్ చొరవ చూపించాడు. మన పార్టీ శక్తి తక్కువగానే వున్నప్పటికీ, ఒక గుర్తింపు కలిగిన రాజకీయ శక్తిగా రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగలిగింది.

రాష్ట్రంలోని పాలక తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాలకు స్వస్తి పలకాలని ప్రగతిశీల మేధావులంతా గళమెత్తారు. ప్రభుత్వ అణచివేత చర్యలు కేవలం విప్లవ పార్టీ సమస్యే కాదనీ, రాష్ట్ర ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కుల సమస్యగా మారిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ చర్చ ప్రభుత్వంతో చర్చలకు దారి తీసింది. కామ్రేడ్ హరగోపాల్

(ఆర్.కే.) పార్టీ ప్రతినిధిగా, శాంతి వార్తల చర్చల బృందానికి నాయకుడిగా పార్టీ వైఖరిని వారి ముందుంచాడు.

2004 అక్టోబర్ 14వ తేదీన గుత్తికొండ బిలం వద్ద కామ్రేడ్ చారుమజుందార్ స్థూపాన్ని ఆవిష్కరించడంతో ఈ చర్చల క్రమం ప్రారంభమయింది. కామ్రేడ్ ఆర్.కే. బహిరంగ సభలో ప్రసంగించారు. సాయుధ పోరాటం ద్వారానే కార్మికవర్గానికి, రైతాంగానికి నిజమైన అధికారం వస్తుందని, దాని కోసం ప్రజలందరు సమయత్తం కావాలని, శాంతి చర్చలు వర్తమాన మజిలీలో ఒక వేదికగా భావిస్తూ వాటి దిశను వివరించాడు. ప్రభుత్వంతో జరిగే చర్చల్లో కూడ ప్రజల హక్కుల గురించి, భూమి సమస్య గురించి, ప్రజల అధికారం గురించి చర్చించబోతున్నామని ఆ సభలో బహిరంగంగానే ప్రకటించాడు. అప్పటిదాక నిషేధానికి గురైన ఒక పార్టీ నాయకుడు, భారతదేశంలో సాయుధ పోరాట రాజకీయాలను ఎజెండా మీదకు తెచ్చి, రివిజనిజాన్ని నడ్డివిరిచిన కామ్రేడ్ చారుమజుందార్ స్థూపాన్ని లక్షలాది ప్రజల మధ్య ఆవిష్కరించి సాయుధ పోరాట పంథా ద్వారానే అధికారం వస్తుందని నిశ్చితంగా ప్రకటించడం భారత విప్లవోద్యమ చరిత్రలోనే అపూర్వ ఘటనగా నమోదైంది.

ప్రభుత్వంతో జరిపిన చర్చల క్రమంలో శాంతి చర్చల బండారాన్ని బహిర్గతం చేసింది. ఝార్ఖండ్‌లోని సరండా అడవులలో జరిగిన రెండు విప్లవ స్రవంతుల విలీనంతో ఆవిర్భవించిన సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటు ప్రకటనను హైదరాబాద్ నుండి కామ్రేడ్ ఆర్.కే.నే బహిరంగంగా ప్రకటించాడు.

రాష్ట్రంలో మారిన రాజకీయ వాతావరణాన్ని ఇంకెంత మాత్రం పొడగించదలచని రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఏకపక్షంగా స్వస్తి చెప్పి 2005 జనవరి నుండి గతంలో ఎన్నడూ లేని విధంగా అణచివేతకు పూనుకుంది. ఈ అణచివేతలో 150 మందికి పైగా పార్టీ నాయకులు, క్యాడర్లు, విప్లవ ప్రజలు అసువులు బాసారు. చర్చల తదుపరి కాలంలో కామ్రేడ్ అక్కిరాజుపై ప్రభుత్వ నిర్బంధం తీవ్రతరం కావడంతోను, ఉద్యమ అవసరాల రీత్యానూ పార్టీ 2006లో ఆయనను ఏఓబీకి బదిలీ చేసింది.

2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్–తొమ్మిదో కాంగ్రెస్ ఏఓబీ, ఉత్తర తెలంగాణా ఉద్యమాలను లోతుగా సమీక్షించింది. విప్లవోద్యమాన్ని, దానిలో జరిగిన తప్పు–ఒప్పులను, నష్టాలకు కారణాలను, గుణపాఠాలను తిరిగి విప్లవోద్యమాన్ని పునరుద్ధరించే లక్ష్యాన్ని అందించింది. సీసీ, పీబీలలో ఉన్న లోపాలను, బలహీనతలను కూలంకషంగా గుర్తించి, వాటిని అధిగమించాలని నిర్ణయించింది. దేశవ్యాప్త ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు స్థావర ప్రాంతాల నిర్మాణం గురించి, సైన్య అభివృద్ధి గురించి, ఐక్యసంఘటన పెంపొందించడం గురించి కర్తవ్యాలు రూపొందించింది. ఏఓబీలో గెరిల్లా యుద్ధాన్ని ఉధృతం చేయాలని, పార్టీని సంఘటితపరచాలనీ, పీఎల్‌జీఏను పటిష్టపరచాలనీ, రాజకీయ అధికార అంగాలను విస్తరించాలని నిర్ణయించింది. ఆంధ్ర, తెలంగాణలో ఉద్యమాన్ని నిలబెట్టుకోవాలనీ, స్వీయాత్మక బలగాలను కాపాడుకోవాలనీ, కచ్చితమైన రహస్య నిర్మాణ పద్ధతులను చేపట్టాలని నిర్ణయించింది. ఏఓబీ

ఉద్యమానికి సీసీ తరపున బాధ్యుడిగా కామ్రేడ్ హరగోపాల్ ఈ కర్తవ్యాలను ఆ జోన్‌లో అమలు చేసేందుకు తీవ్రమైన కృషి చేసాడు.

**ఏఓబీ ఉద్యమ రథసారథి కామ్రేడ్ సాకేత్ నాయకత్వ శైలి మనందరికీ ఆదర్శమైనది, అనుసరణీయమైనది**

పట్టణ, మైదాన, అభివృద్ధి చెందిన ప్రాంతాలను భిన్న సాంఘిక సముదాయాల ప్రజలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించి గైడ్ చేయడంలో అపార అనుభవం సంపాదించిన కామ్రేడ్ సాకేత్ దానికి కొంత భిన్నమైన ఏఓబీ ప్రాంత ఉద్యమ బాధ్యతలను అప్పగించినప్పుడు మనస్ఫూర్తిగా స్వీకరించాడు. ఏఓబీలోని నిర్దిష్టతలనూ, ప్రత్యేకతలను ఆకళింపు చేసుకుంటూనే ఉద్యమ వర్తమాన పరిస్థితులను, భవిష్యత్ గమనాన్ని విశ్లేషిస్తూ, సంశ్లేషణకు పూనుకున్నాడు. 2006లో ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ 3వ కాన్ఫరెన్స్‌లో ఏఓబీ ఉద్యమం తాత్కాలికంగా వెనుకంజలో ఉందని అంచనాకు రావడంతోపాటు, రివైవల్ కృషి కోసం చేపట్టాల్సిన కర్తవ్యాలను రూపొందించింది. పార్టీలోని అన్యవర్గ ధోరణులను సరిదిద్దడానికి క్యాడర్ సిద్ధాంత, రాజకీయ స్థాయిని పెంచి తప్పులపై సూత్రబద్ధమైన పోరాటం ద్వారా పార్టీని తీర్చిమలచడానికి చేపట్టిన దిద్దుబాటు ఉద్యమానికి నాయకత్వం వహించాడు.

ఎల్ఐసీ (లో ఇంటెన్సిటీ కాంఫ్లిక్ట్) ప్రయోగాల ద్వారా ప్రత్యేక కేంద్రీకరణతో ఏఓబీ ఉద్యమంపై కొనసాగుతున్న దాడిని ఎదుర్కోవడానికి, ఎన్‌టీ, ఏపీ ఉద్యమాల తాత్కాలిక వెనకంజ, అనుభవాలు, గుణపాఠాల నుండి నేర్చుకుని ప్రతిఘటించి ఓడించడానికి సైద్ధాంతిక స్థాయిలో విశ్లేషణ చేస్తూ, ఎత్తుగడలు రూపొందించుకొని శక్తివంచన లేకుండా కృషి చేసాడు. ఉన్నత ఫార్మేషన్‌లకు వెళ్ళాలని సీఆర్‌బీలో చర్చించాడు. సీసీ నుంచి శక్తుల కేటాయింపుతో ఏఓబీలో 2007లో సీఆర్‌సీ 1వ కంపెనీ నిర్మాణం జరిగింది.

శత్రు దాడిని ప్రతిఘటించడానికి ఏఓబీలో నాయకత్వ కోర్‌తో కలిపి ఏర్పాటు చేసిన సెంట్రల్ కమాండ్‌కు కామ్రేడ్ సాకేత్ రాజకీయ నాయకత్వాన్ని అందించాడు. ఈ కమాండ్ నేతృత్వంలో జరిగిన టీసీఓసీ సఫలం చేయడం ద్వారా సంపాదించుకున్న వెసులుబాటును ఉపయోగించుకొని విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలలో ప్రజలను కాఫీ తోటల స్వాధీన పోరాటంలో సంఘటితం చేసారు. అలాగే బాక్సైట్ తవ్వకాల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన 97 జీఓ రద్దు కోసం పోరాటాలు పెల్లుబికాయి. కలిమెలలో బీజప్రాయంలో ప్రజా రాజ్యాధికార ఆర్‌పీసీ నిర్మాణాలు ఏర్పడ్డాయి. ఉద్యమం మల్కన్‌గిరి, కొరాపుట్ సరిహద్దులకూ, కొరాపుట్ డివిజన్‌లోని మరి కొన్ని నూతన ప్రాంతాలకు విస్తరించింది. ఈ కృషి అంతటిలో కామ్రేడ్ సాకేత్ స్వయంగా పాల్గొంటూనే గైడెన్స్ అందించాడు.

అప్పటి వరకు ఏఓబీ ఎస్‌జడ్‌సీ కార్యదర్శిగా పని చేస్తున్న కామ్రేడ్‌ను ఇతర ప్రాంత ఉద్యమ అవసరాల కోసం సీసీ బదిలీ చేయడంతో 2008 చివరలో కామ్రేడ్ సాకేత్ సీసీ నుండి ఏఓబీకి ఇన్‌చార్జిగా ఉంటూనే ఏఓబీ ఎస్‌జడ్‌సీ కార్యదర్శి బాధ్యతలను కూడా చేపట్టాడు. 2009లో

ఏఓబీ ఉద్యమాన్ని లోతుగా సమీక్షించి, రాజకీయ, నిర్మాణ సమీక్షను తయారు చేసి, జోన్ 3వ కాన్ఫరెన్స్ 1వ ప్లీనాన్ని జరిపి, ఏఓబీ జోన్ పార్టీలో, ఉద్యమంలో ఎదుర్కొంటున్న సమస్యలు చేపట్టవలసిన కర్తవ్యాలపై అన్ని స్థాయిల పార్టీ కమిటీలలో యూనిటీ ఆఫ్ థాట్‌ను తీసుకురావడంలో, సరైన దిశానిర్దేశం కల్పించడంలో కామ్రేడ్ సాకేత్ కీలక భూమికను పోషించాడు.

**నారాయణపట్నా సాయుధ రైతాంగ పోరాటానికి సరైన దిశానిర్దేశం చేసినవాడు**

2004లో కొరాపుట్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌పై మన పీఎల్‌జీఏ చేసిన చారిత్రాత్మక రెయిడ్ విజయవంతం కావడంలో ఆ ప్రాంత ప్రజల పాత్ర గొప్పది. 2006లో కొరాపుట్‌లోని నారాయణపట్నా, బందుగాం బ్లాకులలో బొరిగి, నాగులబెడ ప్రాంతాలలో భూస్వామ్య వ్యతిరేక సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. సాయుధ శతృవులపై సాధించిన విజయాలు అక్కడ కొనసాగుతున్న ప్రజా ఉద్యమాలను కూడా గొప్పగా ప్రభావితం చేసాయి. అవి పార్టీని ఆ ప్రాంత ప్రజలకు మరింత చేరువ చేసాయి.

2009 నాటికి యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్) మితవాద నాయకత్వం ఆ ఉద్యమానికి సరైన నాయకత్వం అందించలేకపోయింది. పోరాటానికి సిద్ధంగా ఉన్న ప్రజలు సమీప నాగులబెడ, బొరిగి ప్రాంతాలలో మన పార్టీ నాయకత్వంలో ప్రజాయుద్ధ ఓరియంటేషన్‌తో సాయుధ రైతాంగ వ్యవసాయక విప్లవం పురోగమిస్తుండటంతో మన పార్టీ వైపు అడుగులు వేసారు. అక్కడ నెలకొని ఉన్న పరిపక్వ విప్లవకర భౌతిక పరిస్థితులకు మన స్వీయాత్మక శక్తుల విప్లవ కృషిని జోడించి నాయకత్వం అందించాయి సీసీ, ఎస్‌జడ్‌సీ. ఇందుకోసం కొన్ని గైడ్‌లైన్స్ రూపొందించాయి. ఈ కర్తవ్యాల అమలు బాధ్యతలను కామ్రేడ్ సాకేత్ స్వీకరించాడు. 2012 చివరి వరకు అక్కడే కేంద్రీకరించాడు.

భూస్వాములు, వడ్డీ వ్యాపారులు రాజ్యం దన్నుతో 'శాంతిసేన'ను స్థాపించారు. రాజ్య సాయుధ బలగాలతో కలిసి ప్రజల ఆస్తుల విధ్వంసానికీ, నరసంహారానికి పూనుకున్నారు. ఈ దాడిని ప్రతిఘటించకుండా వ్యవసాయక విప్లవం ముందుకు వెళ్ళదనీ, ప్రజలు సాయుధం కావాలని పార్టీ పిలుపునిచ్చింది. అప్పటి వరకు గ్రామ రక్షక దళంగా ఉన్న 'ఘెనువా బాహిని'తో పాటు ప్రజా మిలీషియా దళాలు ఏర్పాటు చేసి సాయుధం చేసింది. 2010లో ప్రధానంగా స్థానిక రిక్రూట్‌మెంట్‌పై ఆధారపడి, సీఆర్‌బీ పంపిన బలగాలతో కలిపి సీఆర్‌సీ 3వ కంపెనీ నిర్మించి సాయుధ శతృవును ప్రతిఘటించింది. ప్రజలలో రాజ్య పాశవికత్వాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని పెంచడానికి 'మనోబల్' మీటింగ్‌లు నిర్వహించింది. శత్రుదాడిని ఎదుర్కోవడానికి అనేక నూతన రూపాలలో ప్రజలను సమయత్తం చేసింది. 'దున్నేవారికే భూమి – విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు' అనే కేంద్ర నినాదం చుట్టుతా చురుకైన సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ, 2012 నాటికి ఆర్‌పీసీలను నిర్మించి బీజప్రాయంలోనే అయినా ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించుకొని ప్రత్యామ్నాయ రాజకీయ అభివృద్ధి నమూనాను ప్రజలు చవి చూసారు. ఈ ప్రాంత వర్గ పోరాటంలో అక్కడక్కడ వర్గపంథాను వదిలి ఆదివాసేతర

సుండి, డోమ్(దళిత) కులాలకు చెందినవారందరినీ తమ శత్రువులుగా భావించే సెక్టేరియన్ అవగాహన కొనసాగింది. కామ్రేడ్ సాకేత్ ఈ తప్పుడు అవగాహనను పార్టీ వర్గపంథా, ప్రజాపంథాకు అనుగుణంగా సరిదిద్ది అన్ని కులాలలోని పీడిత వర్గాలను ఐక్యం చేస్తూ, వర్గ శత్రువులను ఒంటరి చేసే విధంగా ప్రజలనూ, ప్రజా నిర్మాణాలను ఎడ్యుకేట్ చేసాడు.

న్యాయమైన నారాయణపట్నా సాయుధ రైతాంగ పోరాటానికి విశాల ప్రజల మద్దతును సంపాదించడంలో కామ్రేడ్ సాకేత్ నాయకత్వంలో పార్టీ రాజకీయంగా విజయం సాధించింది. అలాగే మాలి, దేవమాలి తదితర విస్థాపన వ్యతిరేక ప్రజాందోళనలకూ, ఇతర న్యాయమైన ప్రజా పోరాటాలకు నారాయణపట్నా రైతాంగ ఉద్యమం తన మద్దతు తెల్పింది. ఉద్యమాన్ని పక్కనున్న బందుగాం, నందపూర్ ఏరియాలకు విస్తరింపజేస్తూ, విశాల ప్రాంతంలో భూస్వామ్య, ప్రభుత్వ, సామ్రాజ్యవాద కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పార్టీ బలమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించింది. ఈ కృషిలో భాగంగా కామ్రేడ్ సాకేత్ సీఎమ్ఏఎస్ నాయకత్వాన్నీ, ప్రజలను సైద్ధాంతికంగా, రాజకీయంగా చైతన్యపరుస్తూ, పార్టీ పంథా చుట్టూ సమీకృతులను చేసాడు. అందుకు స్థానిక పార్టీ కమిటీలను అభివృద్ధి చేస్తూ, సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయిస్తూ, ఆచరణ నుండీ, ప్రజల నుండి నేర్చుకునేందుకు కృషి చేసాడు. ఈ వర్గ పోరాటాన్ని ఒక ప్రయోగశాలగా ఎంచుకొని, అందులో ప్రత్యక్షంగా తాను కూడా భాగస్వామి అయ్యాడు.

ఉద్యమంపై శత్రువు ఫాసిస్టు అణచివేతకు దిగి అర్ధసైనిక బలగాలతో క్యాంపులు పెట్టి కార్పెట్ సెక్యూరిటీని విస్తరించాడు. ఛసి మూలియా ఆదివాసీ సంఘం నాయకుడు నాచిక లింగా దాన్ని ఎదుర్కొని ఉద్యమాన్ని సాయుధ పోరాట మార్గంలో ముందుకు తీసుకుపోయే సంసిద్ధతను కోల్పోయి, మితవాదంలోకి వెళ్ళి ప్రజల చైతన్యంపై నీళ్ళు చల్లె ప్రయత్నం చేసాడు. ఆ సమయంలో కామ్రేడ్ సాకేత్ ఆయనను ఉద్యమంలో నిలబెట్టడానికి సైద్ధాంతిక, రాజకీయ కృషి చేపట్టి ఓపికతో సూత్రబద్ధంగా చివరి వరకు ప్రయత్నించాడు.

కామ్రేడ్ సాకేత్ నారాయణపట్నా రైతాంగ ఉద్యమంపై కేంద్రీకరిస్తూనే జోన్‌లోని విశాఖ-తూర్పు గోదావరి డివిజన్‌లో బాక్సైట్ గనుల వ్యతిరేక పోరాటానికీ, కాఫీ తోటల స్వాధీన పోరాటానికీ, కొరాపుట్‌లోని దేవమాలి బాక్సైట్ విస్థాపన వ్యతిరేక ఆందోళనకు గైడెన్స్ అందించాడు.

2013 సీసీ 4వ సమావేశం దేశవ్యాప్త విప్లవోద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నదని అంచనా వేసింది. పార్టీని తీర్చిమలచడానికి బోల్షివీకరణ క్యాంపెయిన్‌కు పిలుపునిచ్చింది. ఈ క్యాంపెయిన్‌ను విప్లవ స్ఫూర్తితో, ఏఓబీలోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా 2014 చివర నుండి 2016 మధ్య వరకు ఒక ఉద్యమంగా విజయవంతం చేయడానికి కామ్రేడ్ సాకేత్ నాయకత్వం అందించాడు.

**పార్టీలోని మితవాద, అతివాద అవకాశవాద పంథా రాజకీయాలను తిప్పికొడుతూ పార్టీ పంథాను ఎత్తిపట్టాడు**

2009 జోన్ మొదటి ప్లీనం రూపొందించిన కర్తవ్యాల అమలు కార్యాచరణను సమీక్షిస్తూ, 2013 ప్రారంభంలో జోన్ 2వ ప్లీనం జరిగింది. ఉద్యమం కొన్ని రంగాలలో పాజిటివ్ డెవలప్‌మెంట్ ఉండడంతో కొన్ని విజయాలను నమోదు చేసినప్పటికీ, సెట్‌బ్యాక్‌ను అధిగమించలేకపోయిందని ప్లీనం అంచనాకు వచ్చింది. నారాయణపట్నా రైతాంగ ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత ప్రారంభం కావడంతో ఆ దాడిని ప్రతిఘటించి ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోవడానికి సిద్ధపడక నాచిక లింగా ముందుకు తీసుకవచ్చిన మితవాద పంథాను ప్లీనం చర్చించి సరైన దిశను వివరిస్తూ ఒక లేఖను విడుదల చేసింది. ఈ క్రమానికి నాయకత్వం వహించి కామ్రేడ్ సాకేత్ నారాయణపట్నా ఛసి మూలియా ఆదివాసీ సంఘాన్ని, ప్రజలను సరైన పంథావైపు నిలబెట్టాడు.

ఏఓబీ ఎస్‌జడ్‌సీఎమ్‌గా పని చేస్తూ, 2008లో అరెస్టయి 4 సంవత్సరాలు జైలు జీవితం గడిపి, 2012లో విడుదలై తిరిగి ఉద్యమంలో భాగస్వామి అయిన శ్రీరాములు శ్రీనివాస్ (లక్మా) 2013 ప్లీనానికి ముందు పార్టీపై తప్పుడు ఆరోపణలతో పార్టీ నుండి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. పార్టీ నిబంధనావళిని ఉల్లంఘించి క్రమశిక్షణ రాహిత్యంతో అతివాద, అవకాశవాద వాగాడంబరంతో తప్పుడు పంథాను ముందుకు తెచ్చాడు. దీనిపై చర్చించిన ప్లీనం కామ్రేడ్ సాకేత్ దిశానిర్దేశంలో ఆ తప్పుడు పంథాను ఏకగ్రీవంగా తిప్పికొడుతూ ఒక లేఖను విడుదల చేసింది.

ఏఓబీ ఎస్‌జడ్‌సీ సభ్యుడు విజయ్ 2013లో వైద్యం కోసం బయటకు వెళ్ళి అరెస్టయి జైలుకు వెళ్ళాడు. ఆ తర్వాత ప్రాణభీతితో రాజకీయంగా బలహీనపడ్డాడు. జైలులో మితవాద రాజకీయాలు చేపట్టాడు. పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలలో పాల్గొనడాన్ని ఒక ఎత్తుగడగా ఉపయోగించుకోవాలని, తద్వారా శత్రుదాడిలో కొంత వెసులుబాటును సంపాదించవచ్చని సన్నాయి నొక్కులు నొక్కుతూ చర్చను లేవదీసాడు. కామ్రేడ్ సాకేత్ ఆయన మితవాద అవకాశవాద దిగజారుడు రాజకీయాలను విమర్శిస్తూ దీటుగా జవాబు చెప్పాడు.

అదే సమయంలో ఒడిశాలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ (ఎస్‌ఓసీ) కార్యదర్శి సవ్యసాచి పండా ముందుకు తెచ్చిన మితవాద, అవకాశవాద రాజకీయాలను ఎమ్‌ఎల్‌ఎమ్ వెలుగులో తిప్పికొడుతూ, పార్టీ పంథా ఎత్తిపడుతూ పండాకు జవాబు ఇస్తూ ఒక పుస్తకాన్ని సీసీ విడుదల చేసింది. ఇందులో కామ్రేడ్ సాకేత్ తన వంతు పాత్ర నిర్వహించాడు.

ఈ రకంగా పార్టీలో తలెత్తిన మితవాద అవకాశవాద రాజకీయాలు, అతివాద వాగాడంబరంతో మితవాద, లొంగుబాటు వైఖరులు ముందుకు వచ్చినప్పుడు సైద్ధాంతికంగా, రాజకీయంగా వాటిని దీటుగా ఎదుర్కొంటూ, పార్టీ పంథా చుట్టూ క్యాడర్‌ను, ప్రజలను సంఘటితపరచడంలో కామ్రేడ్ సాకేత్ మహత్తరమైన భూమికను పోషించాడు.

**సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయిస్తూ, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వానికి జోడించి ఎత్తుగడలను అభివృద్ధి చేసాడు**

ఏఓబీ వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన ప్రాంతం కావడంతో, విముక్తి ప్రాంత లక్ష్యం పెట్టుకొని ఆర్‌పీసీల నిర్మాణం చేపడుతూ గెరిల్లాబేస్ నిర్మాణ కర్తవ్యం పెట్టుకొని పని చేస్తున్నప్పటికీ, వాటిని అభివృద్ధి చేయడంలో ఎదురవుతున్న ఆటంకాలపై చర్చించడానికి ఏఓబీ నాయకత్వ కోర్‌తో 2014లో ఆర్‌పీసీ వర్క్‌షాప్ నిర్వహించింది. ఆ సందర్భంగా మన ఎత్తుగడలలోని బలహీనతలను గుర్తించి, నేడు తాత్కాలిక సెట్‌బ్యాక్ స్థితిలో మన స్వీయాత్మక శక్తుల బలంపై ఆధారపడి, గెరిల్లాబేస్ ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని, నాయకత్వ కేంద్రీకరణ ద్వారా జీబీ నిర్మాణ పథకం రూపొందించి, దానిని ఆచరణలో పెట్టి, ప్రత్యక్షంగా నాయకత్వం అందించాడు.

2015లో ఏఓబీలో సామాజిక, వర్గ పరిశోధన చేపట్టి గత 30 ఏళ్ళ వర్గ పోరాటం ద్వారా అర్ధవలస, అర్ధభూస్వామ్య చట్రంలోనే ప్రభుత్వాలు అనుసరించిన విధానాల ఫలితంగా జరిగిన మార్పులు, ఉత్పత్తి సంబంధాలలో, వర్గ సంపుటిలో చోటు చేసుకున్న నూతన పరిణామాలు ఏమిటి? అవి మన వ్యూహాన్ని ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నాయా? ఎత్తుగడలలో ఎలాంటి మార్పులు జరగాలి? తదితర అంశాలను ఆధారంగా చేసుకొని విడివిడిగా జరిగిన అధ్యయన రిపోర్టు ఆధారంగా 2016లో నాయకత్వ కోర్‌తో సామాజిక పరిశోధన–మన కార్యక్రమం అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్ ఏఓబీలో కూడా పాత సామాజిక (అర్ధవలస, అర్ధభూస్వామ్య) వ్యవస్థలో పరిమాణాత్మక మార్పులు ఉన్నాయనీ, వక్రీకరించిన పెట్టుబడిదారీ అభివృద్ధి ఉందని గుర్తించింది. దానిపై ఆధారపడి 'ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సంబంధాలపై, సామాజిక పరిశోధన–మన కార్యక్రమం' పత్రాన్ని ఫైనల్ చేసి, ఎత్తుగడలను అభివృద్ధి చేసిన కృషిలో కామ్రేడ్ సాకేత్ కీలక భూమిక పోషించాడు.

సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయిస్తూ రూపొందించుకున్న ఎత్తుగడల ఆధారంగా వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ, గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయాలని అన్ని స్థాయిల పార్టీ కమిటీలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఫీల్డ్ ట్రైనింగ్‌కు ఎస్‌జడ్‌సీ ప్లాన్ రూపొందించింది. కామ్రేడ్ సాకేత్ దానిని ఖచ్చితంగా ఆచరణలో పెట్టి, పై లక్ష్యాన్ని సాధించే విధంగా పర్యవేక్షణ చేస్తూ, నిరంతరం గైడ్ చేసాడు.

ఏఓబీ ఎస్‌జడ్‌సీ అధికార, రాజకీయ ప్రచార పత్రికగా బోల్షివిక్‌ను 2013 నుండి క్రమం తప్పకుండా ప్రచురించి క్యాడర్ల, ప్రజా నిర్మాణాల, ప్రజల రాజకీయ చైతన్యం పెంచే విధంగా సమకాలీన అంతర్జాతీయ, దేశీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వ్యాసాలు రాయడం, నిర్దిష్ట ఎడ్యుకేషన్‌కు సిద్ధాంత వ్యాసాలను ఎంపిక చేయడం, అమరుల జీవిత చరిత్రలు, పోరాట వార్తలు, గెరిల్లా జీవితాల పరిచయం తదితరాలను వినూత్న సృజనాత్మక పద్ధతిలో పత్రికను తీసుకురావడంలో కామ్రేడ్ సాకేత్ గొప్ప రాజకీయ కృషి చేసాడు.

కామ్రేడ్ హరగోపాల్ సిద్ధాంత, రాజకీయ రంగంలో గణనీయమైన కృషి చేశాడు. కేంద్ర

కమిటీ రూపొందించిన వివిధ డాక్యుమెంట్‌లలో ఆయన పాత్ర చెప్పుకోదగినది. అలాగే వాటిని సుసంపన్నం చేయడానికి ఆయన కమిటీలో లోతుగా చర్చించాడు, సవరించాడు. ఉద్యమ పరిస్థితులను కమిటీలో స్పష్టంగా ముందు పెడుతూ సరైన నిర్ధారణలకు రావడానికి, సరైన ఎత్తుగడలు రూపొందించుకోవడానికీ ఎంతగానో దోహదం చేశాడు. 2018 సీసీ 6వ సమావేశంలో కామ్రేడ్ హరగోపాల్ పోలిట్ బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. ఏఓబీకి బాధ్యునిగా ఉంటూనే పని విభజన ప్రకారం ఇతర బాధ్యతలు కూడా నిర్వహిస్తూ వచ్చాడు.

**శత్రు హంతక పథకాలను వమ్ము చేస్తూ ప్రజాయుద్ధాన్ని ముందుకు నడిపిన నాయకుడు**

కామ్రేడ్ సాకేత్ 2006లో రక్షణ రీత్యా ఏపీ నుండి బదిలీ అయి, ఏఓబీ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి అక్కడ కూడా శత్రువు ఆయనను ప్రధాన లక్ష్యంగా ఎంచుకొని దాడులు కొనసాగించాడు. 2007లో విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలలో వందలాది గ్రేహౌండ్స్ బలగాలతో అడవులను చుట్టుముట్టి నెలల తరబడి గాలింపులు చేపట్టాడు. ఆ సమయంలో శత్రువుతో మన పీఎల్‌జీఏ తలపడి చెదురు ముదురు గెరిల్లా చర్యలు నిర్వహించింది. వాడి లక్ష్యాన్ని విఫలం చేసి, నాయకత్వాన్ని రక్షించింది. 2010-11 సంవత్సరాలలో నారాయణపట్నాలలో ఆంధ్ర-ఒడిశా పోలీసు బలగాలు అనేక చుట్టివేత దాడులకు పూనుకున్నప్పటికీ, ప్రజలు, పీఎల్‌జీఏ రక్షణలో సురక్షితంగా తప్పుకుంటూ కామ్రేడ్ సాకేత్ ఆ ఉద్యమాన్ని గైడ్ చేసాడు. 2014 నుండి ఎమ్‌కేవీబీ డివిజన్‌లోని కటాఫ్ ఏరియా (ఆంధ్ర, ఒడిశా సరిహద్దు)ను శత్రువు లక్ష్యంగా ఎంచుకొని ఏరియా సర్వే, నెట్‌వర్క్ తయారీ, జనరల్ అభియాన్‌ల ద్వారా సన్నాహాలు చేసుకొని నాయకత్వ నిర్మూలన లక్ష్యంలో 2015 ప్రారంభానికి వేలాది బలగాలతో 2 రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమన్వయంతో 'ఆలౌట్ అభియాన్' పేరుతో భారీ సైనిక ఆపరేషన్‌ను ప్రారంభించాడు. ప్రజలను భయభ్రాంతం చేస్తూ చుట్టుముట్టి వారిపై విచ్చలవిడిగా కాల్పులు జరిపి హత్య గావించాడు. ప్రజలు క్రియాశీల భాగస్వామ్యంతో, పీఎల్‌జీఏ ప్రతిఘటనతో నాయకత్వాన్ని రక్షించి వాడి దాడి పథకాన్ని విఫలం చేసారు.

శత్రువు లక్ష్యం నెరవేరకపోవడంతో తన వైఫల్యాలను సమీక్షించుకొని ఒక దీర్ఘకాలిక పథకంతో ఎస్‌ఐబీని రంగంలోకి దించి ఎక్కడా బహిర్గతం కాని రహస్య ఇన్‌ఫార్మర్ యంత్రాంగాన్ని ఏర్పర్చుకున్నాడు. మన బలం, బలహీనతలు, పని విధానాన్నీ, నాయకత్వ కదలికలను అధ్యయనం చేసి, 2016 అక్టోబర్ 24న రాంగూడ వద్ద పకడ్బందీ పథకంతో అనుకూల టెర్రయిన్‌లో మనల్ని అన్ని వైపుల నుండి శత్రువు చుట్టుముట్టి దాడి చేసి 31 మంది కామ్రేడ్స్‌ను హత్య చేసాడు. ఆనాటికి పార్టీ చరిత్రలో అది అతిపెద్ద విషాదకర సంఘటనగా నిలిచిపోయింది. ఈ సంఘటనలో కామ్రేడ్ సాకేత్ ఆ చుట్టివేతను ఛేదించే క్రమంలో గాయపడ్డాడు. పార్టీ రాష్ట్ర స్థాయి నాయకత్వం నుండి సాధారణ యువతీ, యువకుల వరకు అమరులయ్యారు. ఇది ఏఓబీ విప్లవోద్యమాన్ని తీవ్రమైన కుదుపుకు గురి చేసింది. పార్టీకి తాత్కాలికంగా కోలుకోలేని నష్టాన్ని కలిగించింది.

ఇంకోవైపు ఈ అమరత్వాలు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు, ఇతర ప్రాంతాలలో రాజకీయ

ప్రకంపనలు సృష్టించింది. ఈ క్రూర హత్యాకాండను నిరసిస్తూ, దేశవ్యాపితంగా విద్యార్థులు ఉద్యమించారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, పౌరహక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, పార్టీలు, వ్యక్తులు కదిలి ఎన్‌కౌంటర్ జరిగిన రాంగూడ ప్రాంతాన్ని సందర్శించి, పోరాడే ప్రజలకు సంఘీభావాన్ని తెలిపి ధైర్యాన్ని కల్పించారు. ఎన్‌కౌంటర్‌పై అనేక నిజనిర్ధారణ బృందాలు వెళ్ళి ఈ హత్యాకాండను ఖండిస్తూ, నివేదికలు వెలువరించాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఒక రాజకీయ ఉద్యమం నిర్మించబడింది. ఈ అమరత్వాలు దేశవ్యాపిత ప్రజలలో పార్టీ రాజకీయ ప్రతిష్టను మరింతగా పెంచాయి. ఇవి ప్రభుత్వాన్నీ, పోలీసు యంత్రాంగాన్ని రాజకీయంగా ఆత్మరక్షణ స్థితిలోకి నెట్టాయి. దానితో తాత్కాలికంగా శత్రువు తన హంతక దాడిని ఆ ప్రాంతంలో నిలిపివేయవలసి వచ్చింది. ఈ రాజకీయ పరిస్థితి ఆ ప్రాంత ప్రజల్ని మరింత విప్లవోన్ముఖుల్ని చేసింది.

2020 అగస్టు వరకు ఏఓబీలో అనేక చుట్టివేత దాడుల నుండి కామ్రేడ్ సాకేత్ తృటిలో తప్పుకున్నాడు. 2018 జనవరిలో టిక్రపడ (కటాఫ్ ఏరియా) గ్రామ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శత్రువును ఎదుర్కొని సురక్షితంగా బయటపడ్డాడు. శత్రువు 2018 మే నెలలో పానిపోదూర్ గ్రామం వద్ద మకాంపై జరిగిన దాడిని తిప్పికొట్టి కొద్ది దూరం రిట్రీట్ కాగానే హెలికాప్టర్‌ల ద్వారా బలగాలను దింపి తప్పుకోవడానికి వీలులేని విధంగా దిగ్బంధించడమే కాకుండా అనేక ప్రాంతాల్లో ఆంబుష్‌లను ఏర్పాటు చేసాడు. ఈ సమయంలో వేలాది మంది ప్రజలు రక్షణ వలయంగా ఏర్పడి పార్టీని రక్షించారు.

2019 ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో తిరియా గ్రామం వద్ద శత్రువు అన్ని వైపుల నుండి చుట్టుముట్టి జరిపిన కాల్పులను అత్యంత సాహసోపేతంగా ప్రతిఘటిస్తూ, వాడి వలయాన్ని గండికొట్టి, ఆరుగురు కామ్రేడ్స్ అమరులై, కామ్రేడ్ సాకేత్‌తోపాటు, మిగిలిన నాయకత్వ కామ్రేడ్స్‌ను రక్షించారు. 2020 జులైలో నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని శత్రువు వాకీలలో జీపీఎస్ ట్రాకర్స్‌ను అమర్చి ఒక కోవర్టు ద్వారా మనకు పంపించాడు. దాని ఆధారంగా మనం ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ, 10 రోజులలో 3 దాడులు చేసాడు. వీటన్నింటిని తిప్పికొడుతూ కామ్రేడ్ సాకేత్ సురక్షితంగా బయటపడ్డాడు. కామ్రేడ్ సాకేత్‌ను లక్ష్యంగా చేసుకొని పదుల సంఖ్యలో భారీ సైనిక ఆపరేషన్స్ చేపట్టినప్పటికీ, ప్రజల, పీఎల్‌జీఏ మద్దతుతో, ప్రతిఘటనతో ఆయన రక్షించబడ్డాడు. ఏఓబీలో అననుకూల టెర్రయిన్ ఉన్నప్పటికీ, తీవ్ర అనారోగ్య సమస్యలు వేధించినప్పటికీ, ప్రత్యక్ష్యంగా క్యాడర్‌లతో ఉంటూ క్షేత్రస్థాయి సమస్యలను అధ్యయనం చేస్తూ, చివరి వరకు గైడెన్స్‌ను అందించాడు.

**వెనుకంజకు గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడానికి సరికొత్త ఎత్తుగడలతో కామ్రేడ్ సాకేత్ చేసిన కృషి**

ఆయన భీషణ అణచివేత క్యాంపెయిన్‌లకు వెరవని, కాలపరీక్షకు తట్టుకొని దృఢంగా నిలిచి ముందుకు సాగి రాటుదేలిన కమ్యూనిస్టు.

2016లో ఏఓబీ ఎస్‌జడ్‌సీ కార్యదర్శి బాధ్యతల నుండి రిలీవ్ అయ్యాడు. సీసీ పని విభజనలో

భాగంగా ఏఓబీ ఉద్యమాన్ని తాను అమరుడయ్యే నాటివరకు గైడ్ చేస్తూ వచ్చాడు. ఏపీలో 2006 నాటికి విప్లవోద్యమం సెట్‌బ్యాక్‌కు గురైంది. శత్రువు ఏపీని మావోయిస్టు రహితరాష్ట్రంగా మార్చుతామని ప్రగల్భాలు పలికాడు. వాడి లక్ష్యాన్ని నెరవేరనీయకుండా శత్రువు కన్నుగప్పి రాష్ట్రంలో పార్టీని పునర్నిర్మించే కర్తవ్యంతో కామ్రేడ్ సాకేత్ నాయకత్వంలో పార్టీ నూతన ఎత్తుగడలను రూపొందించింది. పార్టీ విశాల పీడిత ప్రజలలో, పీడిత, సాంఘిక సముదాయాలలో అత్యంత రహస్యంగా పని చేస్తూ అనేక ప్రజాస్వామిక ఉద్యమాలను నిర్మించింది. ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ ప్రజల న్యాయమైన ఉద్యమానికి మద్దతుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ పిలుపునిచ్చింది. ప్రజలనూ, మహిళలనూ, ప్రజాస్వామికవాదులనూ, మేధావులనూ, విద్యార్థి యువకులను ఉమ్మడి కార్యాచరణకు దింపి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కామ్రేడ్ సాకేత్ విశేషమైన కృషి చేసాడు.

2009 నుండి భారత విప్లవోద్యమ సమూల నిర్మూలన లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకత్వంలో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'నూ, 2017 నుండీ 'ఆపరేషన్ సమాధాన్-ప్రహార్' పేరుతో పార్టీపై, ప్రజలపై అత్యంత క్రూరమైన సైనిక అణచివేతను కొనసాగిస్తున్నది. ఈ అణచివేతను వ్యతిరేకిస్తూ, ప్రజల న్యాయమైన పోరాటానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర, తెలంగాణ)లోని అన్ని వర్గాల ప్రజలనూ, ప్రజాస్వామికవాదులనూ, విప్లవకర మేధావులనూ, ప్రజాసంఘాలనూ, వామపక్ష పార్టీలనూ, ప్రజాశ్రేయోభిలాషులందరినీ కూడగడుతూ కామ్రేడ్ సాకేత్ బలమైన రాజకీయ ఉద్యమాన్ని నిర్మించాడు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల అనుకూల విధానాలకు తోడు, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలను అత్యంత క్రూరంగా అమలు చేస్తున్నది. వీటికి వ్యతిరేకంగా ఆయన విశాల ప్రజలను కూడగట్టి ఉద్యమాలకు నాయకత్వం అందించాడు.

కామ్రేడ్ సాకేత్ సైద్ధాంతిక, రాజకీయ అవగాహనతో అపారమైన వర్గపోరాట అనుభవాన్ని జోడించడం ద్వారా మహిళలు, దళితులు, ఆదివాసులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు తదితర సెక్షన్‌ల ఉద్యమాలను మన పార్టీ పంథాలో సరైన దిశానిర్దేశంతో నడపగలిగాడు. అందులో తలెత్తిన పోస్టుమాడర్నిస్టు, బూర్జువా, పెటీ బూర్జువా సిద్ధాంత ధోరణులను ఎమ్ఎల్ఎమ్ సిద్ధాంతంపై ఆధారపడి తిప్పికొట్టాడు.

ఆయన నిరంతర అధ్యయనశీలి. ప్రజల నుండి, క్యాడర్‌ల నుండి నేర్చుకోవడంలో విద్యార్థిగా ఉండేవాడు. బోధించడంలో ఉపాధ్యాయుడిగా ఉండేవాడు. మావో బోధించిన మూడు పని శైలులను – సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయించడం, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వంతో జోడించడం, నాయకత్వం క్యాడర్‌లతో, ప్రజలతో మమేకం కావడాన్ని తన విప్లవ ఆచరణలో అత్యంత నిబద్ధతతో కొనసాగించాడు.

భారత విప్లవోద్యమంలో అత్యున్నత స్థాయి నాయకుడిగా ఎదిగినప్పటికీ, తనను తాను గొప్పవాడిగా ఏనాడు భేషజాలకు పోలేదు. అత్యంత నిరాడంబరంగా ఉంటూ సాదాసీదా

జీవితం గడిపాడు. తాను నమ్మిన సిద్ధాంతానికీ, అంతిమ ఆశయానికి కట్టుబడి పని చేసాడు. స్వార్థాన్ని దరిచేరనీయలేదు. దేనినీ ప్రజల, విప్లవ ప్రయోజనాలకన్నా మిన్నగా భావించలేదు. 40 సంవత్సరాల సుదీర్ఘ విప్లవ జీవితంలో విప్లవోద్యమంలోని అనేక మలుపులు, ఆటుపోట్లు, గెలుపోటములు, కష్టనష్టాలలో స్వయంగా భాగస్వామిగా ఉన్నాడు. విజయాలకు పొంగిపోవడం, ఓటములకు కృంగిపోవడం చేయలేదు. విజయాల్లో తనను ముందుంచుకోవడం చేయలేదు. ప్రతి ఓటమిలో తన బాధ్యతను గుర్తించడంలో నిజాయితీగా ముందుండేవాడు. ఉద్యమంలో ప్రతి సమస్యను సరైన మార్క్సిస్టు పద్ధతిని అనుసరిస్తూ, విశ్లేషించి సంశ్లేషించేవాడు. పార్టీ అంతరంగిక చర్చలలో చురుకుగా పాల్గొన్ని సూటిగా మాట్లాడేవాడు.

### సాంస్కృతిక రంగంలో కామ్రేడ్ సాకేత్ కృషి

కామ్రేడ్ సాకేత్ జననాట్యమండలి వికాసంలో ముఖ్య పాత్ర వహించాడు. జననాట్యమండలి వర్క్‌షాప్‌లను నడిపించడం, అందులో డోలక్కు వాయించడం దగ్గర నుంచి దాని పని విధానం గురించిన చర్చలో, మార్గదర్శకత్వంలో కామ్రేడ్ సాకేత్ పాత్ర ఉన్నది. యాభై సంవత్సరాల జననాట్యమండలి చరిత్రను తయారు చేయడంలో ఆయన పాత్ర ముఖ్యమైనది. నిర్బంధ పరిస్థితుల్లో విప్లవ ప్రజా సాంస్కృతిక సంస్థ జననాట్యమండలి బహిరంగంగా పనిచేయలేని పరిస్థితుల్లో దాని పని విధానానికి సంబంధించిన ఉన్నతమైన అవగాహనతో రాష్ట్ర కమిటీ రూపొందించిన పర్‌స్పెక్టివ్ వెలుగులో నూతనంగా సాయుధ జననాట్యమండలి దళాలు పురుడుపోసుకున్నాయి. కళా సాంస్కృతిక రంగంలో విప్లవ కృషికి సంబంధించి నూతన అవగాహనను పెంపొందించడంలో కామ్రేడ్ హరగోపాల్ పాత్ర వుంది.

### మహిళా ఉద్యమంలో, మహిళా కేడర్‌ల వికాసంలో కా.సాకేత్ కృషి

ప్రత్యేక మహిళా ఉద్యమాన్ని నిర్మించాలనే పార్టీ అవగాహనలో భాగంగా రాష్ట్రంలో 1995లో ఆ దిశలో పని ప్రారంభమైంది. పట్టణాల్లో ఉద్యోగినులు, మేధావులు, విద్యార్థులు, బస్తీలలోని (స్లమ్స్) కార్మిక స్త్రీలలో జరిగిన కృషి ఫలితంగా బలమైన, సంఘటితమైన ఉద్యమం రూపొందింది. ఆ ఉద్యమం నుండి ఎంతో మంది మహిళా కామ్రేడ్స్ విప్లవోద్యమంలోకి రిక్రూట్ అయ్యారు. ఈ మొత్తం కృషి వెనుక కామ్రేడ్ హరగోపాల్ పాత్ర విశిష్టమైనది.

### జీవిత భాగస్వామిగా, తండ్రిగా కా.సాకేత్

వ్యక్తిగత జీవితంలో కూడా కుటుంబాన్ని విప్లవకరంగా తీర్చిదిద్దడంలో సఫలమయ్యాడు. తన ఏకైక కుమారుడు పృథ్వీని తల్లి శిరీష ప్రేమతో పెంచుకున్నది. ఆయనకు యుక్తవయస్సు రాగానే పెరిగిన సామాజిక స్పృహకు తోడు, తండ్రి విప్లవ జీవితం ఆయనను సహజంగానే విప్లవమార్గం పట్టించింది. కామ్రేడ్ సాకేత్ పార్టీ నాయకుడిగానే కామ్రేడ్ పృథ్వీకి సరైన దిశానిర్దేశం చేసాడు. అమరుడు కా.మున్నా మంచి కమ్యూనిస్టుగా రూపొందేందుకు తగిన మార్గదర్శకత్వం అందించాడు. పీడిత ప్రజలు, వర్గపోరాటం, పార్టీ కామ్రేడ్ పృథ్వీని విప్లవకారుడిగా తీర్చిదిద్దగా, కా.మున్నా తన జీవితాన్ని సమాజ మార్పు కోసం అర్పించి, 2016 అక్టోబర్ 24, రాంగూడ

ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. కొడుకు మరణవార్త తల్లి శిరీషకు తీవ్రమైన దుఃఖాన్ని కలిగించినా, పీడిత ప్రజల కోసం తన కొడుకు ప్రాణాలర్పించడం ఎంతో గర్వంగా ఉందని సగర్వంగా ప్రకటించింది. ఈ సందర్భంగా సుదూరంగా ఉన్న తన సహచరి కామ్రేడ్ శిరీష దుఃఖంలో తాను పాలుపంచుకుంటూనే, 'మున్నాకు తల్లిగా ఆలోచించినంతకాలం బాధను భరించాల్సి వస్తుంది. అనేక మంది పిల్లలకు తల్లిని అనుకుంటే బాధను అధిగమించవచ్చు' అని కామ్రేడ్ సాకేత్ పంపిన సందేశం ఎంతో స్ఫూర్తిదాయకమైనది. కామ్రేడ్ సాకేత్ అమరత్వం సందర్భంగా తన సహచరి అంతులేని విషాదాన్నీ, వేదనను, కన్నీళ్ళను దిగమింగుకుంటూ చేసిన చైతన్యవంతమైన ప్రకటనల్లో ఆమె ప్రదర్శించిన మనోనిబ్బరం వెనక సహచర జీవితంలో కామ్రేడ్ సాకేత్ నెలకొల్పిన గొప్ప ఆదర్శాలనూ, ప్రేరణను మనం చూడవచ్చు.

**కామ్రేడ్ సాకేత్‌లా...**

భారత విప్లవోద్యమం సెట్‌బ్యాక్‌లో ఉన్న నేటి అత్యంత క్లిష్ట పరిస్థితులలో అమరుడు కామ్రేడ్ సాకేత్‌లా ప్రతీ కామ్రేడ్ ప్రత్యేకంగా నాయకత్వ కామ్రేడ్స్ కఠోర, చేతనాబద్ధ వ్యక్తిగత, సమిష్టి కృషి చేయడం ద్వారా ఉద్యమానికి ఉన్న గొప్ప అవకాశాలను మన పార్టీ సద్వినియోగం చేసుకోగలుగుతుంది.

కామ్రేడ్ సాకేత్ తుదిశ్వాస వదిలే వరకు కఠోర శ్రమకు, రిస్కులకు, సవాళ్లకు, నూతన ఉన్నత బాధ్యతల నిర్వహణకు వెనుకాడలేదు, నష్టాలకు బాధ్యత పడడానికి తప్పుకోలేదు. సాదా సీదా జీవన శైలి, సరళ మాటతీరు, తీక్షణ దృష్టి, షార్ప్ చర్చా పద్ధతి, సరైన మార్క్సిస్టు విశ్లేషణా పద్ధతి, సూటియైన మాటతో పాటు రాత శైలి అర్థవంతమైనవి. తన విప్లవ జీవితంలో అనుక్షణం కమ్యూనిస్టు మానవ సంబంధాలనూ, విలువలను బోధించి, ఆ ఉన్నత విలువలతోనే జీవించి నూతన మానవుడికి ఒక నమూనాగా నిలిచాడు. కార్మికవర్గ ఉత్తమ పుత్రుడుగా కామ్రేడ్ సాకేత్ సదా మనల్ని తన విప్లవ జీవిత ఆచరణ ద్వారా మేల్కొల్పుతూనే ఉంటాడు.

యీ అర్ధ వలస-అర్ధ భూస్వామ్య దోపిడీ వ్యవస్థను నాశనం చేసి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించటం కోసం దేశంలో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవటానికి కార్మిక, కర్షకులు, మహిళలు, విద్యార్థి, మేధావులు, యువతీ-యువకులు కామ్రేడ్ రామకృష్ణ విప్లవాచరణ నుండి ప్రేరణ పొంది ఆయన ఆశయాలను పరిపూర్తి చేయటానికి విప్లవోద్యమంలో వేలాదిగా భాగస్వాములు కావాలనీ, ఈ ఫాసిస్టు దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా దృఢసంకల్పంతో పోరాడాలనీ పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిస్తున్నది.


నేను
ఎవరినంటే
పుట్టుకతో ప్రమేయం లేనివాడిని
మరణంతో ప్రమేయం వుండీ లేనివాడిని
మధ్యకాలంలో నేను !
నేను
గత నా మానవసారాన్ని ఆకళింపు చేసుకుంటున్నవాడిని
గతం వర్తమానంలోకి ఎగబాకిన వైనాన్ని అధ్యయనం చేస్తున్నవాడిని
వర్తమానం భవిష్యత్‌లోకి పురోగమించే గతిశీలతను విశ్వసించినవాడిని
అందుకే నేను !
నేను
చరిత్ర పురోగమిస్తుందని నమ్మిన వాడిని
చరిత్ర పురోగమనంలో భాగమైనవాడిని
చరిత్రను నడిపించే చోదక శక్తిని
ఇప్పుడు
నేను ఎవరినంటే
నేను కమ్యూనిస్టును !
కామ్రేడ్ ఆర్‌కే రాసిన కవిత....